పంపినవారు

అల్లూరు శివకోటేశ్వరరావు

7-117, నియర్ మండలాఫీసు,

కారంచేడు, పోస్టు మరియు మండలం

బాపట్ల జిల్లా పిన్ 523168.

సెల్  9491708633.

# టీచర్  - ఎ నేషన్ బిల్డర్

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయునిది ఓ గురుతరమైన బాధ్యత. భావి భారత నిర్మాతలు ఉపాధ్యాయులేనని పెద్దలమాట. జాతికి జ్ఞాన దీపికలు ఉపాధ్యాయులేనని విజ్ఞుల అభిప్రాయం. మాతాపితలకన్నా ముఖ్య బంధువు (గురువే) ఉపాధ్యాయుడేనని వివేకుల వచనము. సమసమాజ నిర్మాణరూపశిల్పులు వారే. కారణం ఉప = తన సమీపానికి రప్పించుకొని; అధ్యాయః = చదువు చెప్పేవాడు ఎవరో ఆయనే ఉపాధ్యాయుడు. ఎవరిని గురువుగా భావించాలి అంటే... " ప్రేరకః సూచకశ్చైవ వాచకో దర్శకస్తథా। శిక్షకో బోధకశ్చైవ షడతే గురవఃస్మృతాః।" ప్రేరణనిచ్చువాడు, సూచనలిచ్చువాడు, (సత్యం) మాట్లాడువాడు, దారిచూపువాడు, శిక్షణనిచ్చువాడు, బోధించువాడు వీరు ఆరుగురినీ గురువులుగా భావించాలి.

సింహంలా  సింహాసనంపై కూర్చునే రాజైనా, మందీ మార్బలంతో మందహాసంచేసే మంత్రైనా, కుబేరుడైనా, కుచేలుడైనా వినమ్రుడై పాదాభివందనం చేసేది, నమస్కరించేది ఒక్క ఉపాధ్యాయునికే. (గురువుకే). కారణం ఒక విద్యార్థి ఒకటవ తరగతి నుండి డిగ్రీ వరకు టీచర్ వద్ద 25000 గంటలు ఉంటాడు. టీచర్ ఆ విద్యార్థిని ఎలా ఏరూపంలోనికి మలవాలనుకుంటే ఆరూపంలోనికి మలచగలడు. సమాజానికి అందించగలడు. ఒక శాస్త్రవేత్త క్రొత్త వస్తువులను కనిపెట్టి, తయారు చేయగలడు. కానీ ఉపాధ్యాయుడు అట్టి శాస్త్రవేత్తలను, డాక్టర్లను, ఇంజనీర్లను, సమాజ అవసరాలు తీర్చే మరెందరినో తయారుచేసి, సమాజానికందించి, సమాజగతిని మార్చగలడు. నూతన సమాజాన్ని సృష్టించగలడు. అందుచేతనే చాణుక్యుడు, టీచర్ ఒక జాతి నిర్మాత అని వర్ణించగా, అనంతరము "టీచర్ ఒక పర్సనాలిటీ బిల్డర్, సొసైటీ బిల్డర్, నేషన్ బిల్డర్" అని భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిద్ గారు అన్నారు.

ఉపాధ్యాయుని ఒక శిల్పి అనుకుంటే... ఒక శిల్పి తన చేతిలో రూపుదిద్దుకునే ప్రతి శిల్పం పట్ల తనకున్న శక్తి యుక్తుల్ని పూర్తిగా వినియోగిస్తాడు. అన్ని పరికరాలనూ జాగ్రత్తగా వినియోగిస్తూ ప్రతి కోణంలోనూ తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాడు. ఫలితంగా అతని హృదయంలోని అద్భుతమైన కళాఖండం, కఠినమైన శిల  నుండి రూపుదిద్దుకుంటుంది. మన ముందు సాక్షాత్కరిస్తుంది.

నేడు మారుతున్న కాలంలో భవిష్యత్తును దృష్టిలోఉంచుకొని ప్రతి ఉపాధ్యాయుడు శిల్పిలా ఆలోచించాలి. తన వద్ద చదువుకునే ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నతమైన వ్యక్తిగా, సత్ప్రవర్తనతో బాధ్యతాయుతమైన పౌరునిగా తీర్చిదిద్దాలి. విద్యార్థి అధిరోహించే ఉన్నత శిఖరాలనే ఉపాధ్యాయుడు తన విజయాలుగా భావించి ఆనందించాలి. దానికి మొక్కవోని పట్టుదలతో కృషిచేయాలి.

ఉపాధ్యాయుని ఒక తోటమాలిగా భావిస్తే....

బడి అనే నారుమడిలో విద్య అనే విత్తనం వేసి, అక్షరం అనే నీరుపోసి, చెడు అనే కలుపును ఏరేసి, మంచి ఫలాలను సమాజానికి అందించేవాడు – ఉపాధ్యాయుడు.

"పిల్లలు సహజంగా పెరిగే మొక్కల్లాంటివారు వారి ఆలనాపాలనా చూసే తోటమాలి – ఉపాధ్యాయుడు. ప్రేమ, అభిమానం, వాత్సల్యం, ప్రోత్సాహం వల్ల పిల్లలు అభివృద్ధిచెందుతారు." అన్న స్వామి వివేకానంద మాటలను మదిలో ఉంచుకోవాలి. "అక్షరం ఆయుధం, అక్షరం ఆశయం, అక్షరం అక్షయంగా; అక్షరాలను విద్యార్థుల మెదళ్ళలో నాటుతూ, బంగారు పంటలు పండించే వారే జాతినిర్మాతలు, వారే ఉపాధ్యాయులు.

అవసరాలు కొత్తదారులను వెదికితే, అనుభవాలు క్రొత్త పాఠాలను నేర్పుతాయి. మారుతున్నకాలం, మానవులు కోరుకునే అవసరాలు, వానికనుగుణంగా లక్ష్యాలు ఉండాలి. విద్యార్థులకు  వారి వ్యక్తిగత లక్ష్యాలను ఏర్పరచాలి. దానికై వారిలో ఆలోచనలను నాటాలి.

“ఒక ఆలోచనను నాటితే అది ఒక పనిగా ఎదుగుతుంది. ఒక పనిని నాటితే అది అలవాటుగా మారుతుంది. అలవాటును నాటితే అది వ్యక్తిత్వంగా మారుతుంది. ఒక వ్యక్తిత్వాన్ని నాటితే అది తలరాతగా మారుతుంది. కాబట్టి మీ తలరాతలను సృష్టించుకునేది మీరే.” అని విద్యార్థులకు తెలియజేయాలి. జీవితంలో చిన్న చిన్న కష్టాలకు, అపజయాలకు కృంగిపోకుండా, ఆత్మహత్యలకు పాల్పడకుండా ధైర్యంగా ఎదుర్కొనే మనస్థైర్యం కలిగిన వ్యక్తులను రూపొందించాలి ఉపాధ్యాయుడు. బలపమనే ఆయుధాన్నిచ్చి, పలకపై సమరం చేయిస్తూ, విద్యను, బ్రతుకు విద్యను బోధించే అక్షరయోధుడు ఉపాధ్యాయుడు.

“ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకోండి! దాన్నే మీ జీవిత లక్ష్యంగా చేసుకోండి. దాన్నే ధ్యానించండి. దాన్నే కలలు కనండి. దాన్నే శ్వాసించండి. అదే విజయానికి మార్గం.” అన్న వివేకానంద స్వామి మాటలను మనసునందుంచుకోండి. లక్ష్యసాధనకు అహరహం శ్రమించండి. ఒక వేళ ఓటమి ఎదురైతే... వదలి వెళ్ళిన కాలాన్ని, విడిచివెళ్ళిన పాదాన్ని, కరిగిపోయిన కలల్ని, కన్నీటిని మిగిల్చిన ఆశల్ని తలచుకుంటూ, గడచిపోతున్న ‘నేడు’ను, ఎదురు వచ్చే ‘రేపు’ను వెళ్ళిపోనీయకు, కాలాన్ని సద్వినియోగం చేసుకో, ధనాత్మక ఆలోచనలతో ఉండు అని బోధించాలి. విద్యార్థులను కార్యోన్ముఖులను చేయాలి.

చాణుక్యుని చేతిలో రూపుదిద్దుకున్న శిల్పం – చంద్రగుప్తుడు; సమర్థరామదాసు గారు తయారుచేసిన వీరఖడ్గం ఛత్రపతి శివాజీ; రామకృష్ణ పరమహంస అందించిన ఆధ్యాత్మిక శిఖరం – వివేకానందుడు. ఈ గొప్ప గురువులను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు నేటి సమాజ పరిస్థితులను ఎదుర్కొని నిలబడేలా విద్యార్థులను తయారు చేయాలి.

ఉపాధ్యాయులు విద్యార్థుల మధ్య బంధం: “ఓం సహనావవతు, సహనౌభునక్తు, సహవీర్యం కరవావహైః తేజస్వినావధీతమస్తు మావిద్విషావ హైః ఓం శాంతి శాంతి శాంతిః” అన్నది నాటి ప్రార్థన.(కృష్ణయజుర్వేదములో తైత్తరీయ ఉపనిషత్ 2.2.2) ఇది గురుశిష్యుల మధ్య సంబంధం ఎలా ఉండాలో తెలుపుతుంది. దీని అర్థం– మేము కలసి రక్షింపబడుదుము గాక! కలసి భుజింతుము గాక! కలసి సామర్థ్యము పొందుదుము గాక! తేజస్వంతులము అగుదుముగాక! విరోధము పొందకుందుముగాక! మా మధ్య ద్వేషము కలగకుండు గాక!

“సంబంధాలు విహంగాల వంటివి. వాటిని గట్టిగా పట్టుకుంటే బ్రతకలేవు. వదులుగా పట్టుకుంటే ఎగిరిపోతాయి. జాగ్రత్తగా పట్టుకుంటే నీతోనే నిలిచిపోతాయి.” ఇక్కడ విద్యార్థిని విహంగంగా భావిస్తే.. క్రమశిక్షణ సూత్రాలు, పట్టుకోవడమైతే, పట్టుకునే వ్యక్తి ఉపాధ్యాయుడైతే, అవసరమైనంతవరకే వాటిని వినియోగించుకోవాలి.

శిష్యునిలో తప్పులు కనబడితే... వానిని తొలగించడం ఎలాగో,వేమన మాటల్లో చూద్దాం.

గురువు చిల్ల గింజ కుంభమీ దేహంబు
ఆత్మకలుష పంక మడుగు బట్ట
తెలిసి విరిచెనేని దివ్యామృతము తేరు
విశ్వదాభిరామ వినురవేమ!

దేహమనే కుండలో లోకజ్ఞానమనే ఏటి నీటిని పడితే, అందులో కొంత బురద ఉండే అవకాశం ఉండవచ్చు. చిల్ల గింజను వాడితే బురద అంతా క్రిందకు చేరి నీరు తేరుకుంటుంది. ఆత్మలోని బురద అడుగు పట్టేటట్టు గురువు చిల్లగింజలా పనిచేసి విరిచితే దివ్యామృతమే లభిస్తుందని వేమన చెబుతాడు.

విద్యార్థి నడతలో తప్పులు కనబడితే, ఉపాధ్యాయుడు ఆ తప్పులను సరిదిద్దునపుడు చిల్లగింజలా పనిచేయాలి అని ఇక్కడ గ్రహించాలి.

విద్యార్థులలో కర్పూరం లాంటి విద్యార్థులు విద్యాగ్ని తగలగానే జ్వలిస్తారు. కొందరు విద్యార్థులు కర్రలాంటివారు విద్యాగ్ని తగిలితే, ఊది రగిలిస్తేనే రగులుతారు. మరికొందరు అరటిబోదెలాంటి వారు, వారిని విద్యాగ్నిలో వేసినా నీరుగారిపోతారు. వారు ఏ తరహాకు చెందినవారో గమనించి, వారికి తగిన విధంగా నేర్పించాలి. వారిని సమాజంలో బ్రతికే విధంగా, సమసమాజానికి సహాయకారులగు విధంగా రూపొందించి, అందించాలి.

కుటుంబ విలువలు, సామాజిక విలువలు, ప్రజాస్వామిక విలువలు వ్యక్తిగత విలువలు నేర్పాలి.మంచిపౌరునిగా తయారు చేయాలి. "స్వార్థం కన్నా దేశసేవ మిన్న." అని దేశసేవకు, సమాజసేవకు అంకితమయ్యే సేవకులు కావాలి. సమాజ సేవలో భాగస్వాములు కావాలి. అందరూ కలిసి జీవించేలా ఐక్యతా భావాన్ని పెంపొందింపచేయాలి. ఉపాధ్యాయుని బోధనలు పైన తెలిపిన అంశాలకు సాధనలు కావాలి. ప్రాంతీయ, భాషా, కులమత విభేధాలకు తావులేకుండా, జాతీయ సమైక్యతకు బాటలు వేయాలి.

"ప్రశ్న నుండి పుట్టు పరిణతి జ్ఞానమ్ము
ప్రశ్నతోడ పెరుగు ప్రాభవమ్ము
ప్రశ్నలేక ప్రగతి ప్రశ్నార్థకంబురా!
నవయుగాల బాట నార్లమాట!" ప్రశ్నించకున్న తెలుసుకొనలేరు, జ్ఞానం పొందలేరు. అందుకేవిద్యార్థులకు ప్రశ్నించే తత్త్వం నేర్పించాలి. ఆ ప్రశ్నలతో తరగతికి జీవితానికీ వారధి కట్టేవాడే నిజమైన ఉపాధ్యాయుడు.

వివిధ అంశాలలో మానవులలో, సమాజంలో మార్పులు రావడం సహజం.

"మార్పులోన జగతి వర్ధిల్లు చున్నది
మార్పులేక ఇలను ప్రగతి లేదు
మార్పుపైన మనకు భయమేల చెప్పండి
మార్పులేక మనిషి మరగుజ్జు సుమ్ము" అంటారు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర రెడ్డిగారు. మార్పును మంచిదిశగా మార్చి ప్రగతిపథాన నడిపించగల వారు ఉపాధ్యాయులు.

"ఈసురోమని మనుజులుంటే దేశమేగతి బాగుపడునోయ్, మందగించక ముందు కదుగెయ్ వెనుకబడితే వెనుకనోయ్" అన్న గురజాడ వారి మాటను గుర్తుంచుకొని ప్రగతిని సాధించే విధంగా పౌరులను తయారు చేయాలి.

దేహదారుఢ్యం పెంచేందుకు, మానసిక ఉల్లాసం కలిగేందుకు, క్రమశిక్షణ అలవడేందుకు ఆటలు ఆడించాలి. భయాన్ని పోగొట్టేందుకు, భావాలను వ్యక్తీకరించేందుకు సాహిత్యపోటీలు నిర్వహించాలి.లోకంపోకడ తెలియడానికి, క్రొత్త ప్రదేశాలకు వెళ్ళినపుడు ఎలా ఉండాలో, ఎలా ప్రవర్తించాలో తెలియడానికి విజ్ఞానయాత్రలు చేయించాలి. మూఢాచారాలను ఖండించాలి. మంచిని ఆహ్వానించాలి. మంచిని పెంచాలి, పంచాలి, మంచిమనిషిగా బ్రతకాలి. వ్యక్తిగత విలువలు, కుటుంబ విలువలు, సామాజిక విలువలు తెలుసుకొని, చైతన్యవంతుడై, ప్రజాస్వామిక జీవనానికి సహాయపడు ఉత్తమ పౌరుని ఉపాధ్యాయుడే తయారు చేయాలి. అలా చేయుటయే నవభారత నిర్మాణానికి పునాది. ఆ పునాదులను బలిష్ఠంగా వేయువారు ఉపాధ్యాయులే.

ఉపాధ్యాయుడు ఒక గొర్రెల కాపరి వంటి వాడు. గొర్రెలకాపరి అన్ని గొర్రెలను ఒకే రకంగా కాపుకాస్తాడు రక్షిస్తాడు. కానీ నడవలేని గొర్రె పిల్లయినా, కుంటి గొర్రెపిల్లయినా, నడవలేకపోయినా, తోడేలు బారిన పడకుండా దానిని రక్షించడానికి తానే తన భుజాలపై ఎత్తుకొని మోస్తాడు. అలానే ఉపాధ్యాయుడు నిదానంగా నేర్చుకొనే విద్యార్థి బాధ్యతను తన భుజస్కందాలపై వేసుకొని తానే బాధ్యత వహించాలి. అతడిని వృద్ధిలోకి తీసుకొని వచ్చేటట్లు చేయాలి.

నిజానికి ఉపాధ్యాయుడు ఒక ఓవర్‌హెడ్ ట్యాంకు లాంటివాడు. ఎత్తులో గల ట్యాంకులో ఏ నీరు ఉంటే ఆ నీరు కుళాయిల్లో వచ్చినట్లు, ఉపాధ్యాయునిలో ఏ గుణాలుంటాయో అవే ఆయన బోధనలో లభిస్తాయి కాబట్టి ఉపాధ్యాయుడు మంచి గుణగణములు కలిగి యుండి జాతినిర్మాణ యజ్ఞంలో సమిధయై, తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలి. దేశాభివృద్ధికి సమసమాజాభివృద్ధికి సహాయపడాలి. వీటన్నింటినీ పరిశీలించిన తరువాత "న్యాయం చెప్పేవాడికి నేర్పుకావాలి. పాఠం చెప్పేవాడికి ఓర్పు, నేర్పు రెండూ కావాలి అని అర్థమౌతుంది. ఆ రెండింటిని వినియోగించి నేషన్ బిల్డింగ్‌లో భాగస్వామి కావాలి.

సత్యఅహింసల్ని బోధించిన గౌతమ బుద్ధుడు, అద్వైతాన్ని బోధించిన శంకరాచార్యుడు, సత్యాన్వేషణలోనే జీవితాన్ని గడిపిన సోక్రటీస్, ప్రేమను త్యాగాన్ని బోధించిన జీసెస్‌క్రీస్ట్, ఏకేశ్వరోపాసనను బోధించిన మహమ్మద్, హైందవ మతసారాన్ని ప్రపంచానికి తెలియజెప్పిన వివేకానంద, బెత్తాల విద్యాబోధననకు స్వస్తి పలికిన మాంటిస్సోరి, సర్వమత సౌభ్రాతృత్వాన్ని బోధించిన మహాత్మాగాంధీ, వేదాంతాన్ని నిత్యజీవితానికి అన్వయింపచేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వీరంతా ఉత్తమోత్తమమగు గురువులు. వీరి బోధనలు మానవాళిని ప్రగతి పథంలో ముందుకు నడిపాయి. ఈ మహామనుషుల్ని ఆదర్శంగా తీసుకుని, మనిషిని మరింత పరిపూర్ణునిగా తీర్చిదిద్దే విద్యాబోధన చేయవలసిన బాధ్యత నేటి ఉపాధ్యాయులపై ఉంది.

ఉపాధ్యాయుని బోధనలు, సమస్యా పరిష్కారానికి శోధనలు. ఆ ఉపాధ్యాయుని మూర్తిని చూడగానే ప్రజలలో ఒక స్ఫూర్తి రావాలి. సామాజిక సేవలో అందరూ దీప్తిని పొందాలి. **జై జవాన్, జై కిసాన్** అనే మాటలతో పాటు **జై గురుజన్** అనే రోజులు త్వరలోనే రావాలని ఆశిస్తూ.... వారి మార్గదర్శనంలో దేశం ప్రగతిబాట పయనించునని, సుస్థిరత సాధించునని, ప్రగాఢంగా విశ్వసిద్దాం!